సర్వేశ్వరీ లలితా త్రిపుర సుందరి నమోస్తుతే


లలిత త్రిపుర సుందరిగా బూరుగులమ్మ


ఇసుకపల్లిలో అమ్మవారు..


చండీదేవిగా బండ్లమ్మ దర్శనం


లింగోద్భవస్వామి ఆలయంలో..

రేపల్లె రూరల్: దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా 7వ రోజు శనివారం పట్టణంలోని వివిధ దేవాలయాలలో అమ్మవార్లు లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఓల్డ్ టౌన్‌లోని గ్రామ దేవత బూరుగులమ్మ, ఇసుకపల్లిలో చెన్నమల్లేశ్వర స్వామి ఆలయంలో భ్రమరాంబ, పేటేరు గ్రామదేత శ్రీమహాలక్ష్మి గుండెపాటమ్మ లలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవార్లకు పసుపు, కుంకుమ, పుష్పాలు, నూతన వస్త్రాలతో కూడిన సారెను సమర్పించి, మొక్కులు చెల్లించారు. లలితా సహస్ర నామ పారాయణం, దుర్గాదేవి భక్తి గీతాలు ఆలపించారు. ఆలయాల కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

పిట్టలవానిపాలెం : అల్లూరు శ్రీరాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. చందోలు గ్రామంలోని లింగోద్భవస్వామి దేవాలయంలో పార్వతీ దేవిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. బగళాముఖి అమ్మవారికి చండీ దేవి అలంకరణ చేపట్టారు. బండ్లమ్మ ఆలయ చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, ఈఓ నరసింహమూర్తి, లక్ష్మీనరసింహస్వామి ఆలయ చైర్మన్ వాలి వెంకట శివారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం

బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి

పిట్టలవానిపాలెం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో 175 అసెంబ్లీ స్థానాలను వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంటుందని బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి అన్నారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో శనివారం ఆంధ్రప్రదేశ్‌కు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. బాపట్ల నియోజకవర్గంలో భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా తాను గెలుస్తానని సర్వేలు చెబుతున్నాయన్నారు. 78 శాతం మంది ఓటర్లు సిట్టింగ్ ఎమ్మెల్యేకి మద్దతు ఉన్నట్లు తేలిందన్నారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు నవంబర్ 1 నుంచి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపీపీ షేక్ బాజి, వైస్ ఎంపీపీలు సీతారామరాజు, కృపానందం, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అహ్మద్ హుస్సేన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కోన రఘుపతి

బోలాయపాలెం పంచాయతీ భవనం ప్రారంభం

కర్లపాలెం: బోలాయపాలెం గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని ఎమ్మెల్యే కోన రఘుపతి శనివారం ప్రారంభించారు. సర్పంచ్ కేసన లక్ష్మి భావ్నారాయణ, మాజీ సర్పంచ్ కారంకి ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఏఎంసీ చైర్మన్ సీతారామిరెడ్డి, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపల్లె ఆర్డీఓగా హేలా షారోన్ బాధ్యతలు



రేపల్లె రూరల్: ఏపీపీఎస్సీ గ్రూప్–1లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనపరిచిన హేలా షారోన్‌కు తొలి పోస్టింగ్ రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారిగా ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆర్డీవోగా ఆమె శనివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఆర్డీఓ షారోన్‌కు రెవెన్యూ డివిజనల్ కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా షారోన్ మాట్లాడుతూ గ్రూప్–1 ద్వారా ఎంపికైన తనను తొలి పోస్టింగ్ ఆర్డీవోగా నియమించటం ఆనందంగా ఉందన్నారు. డివిజన్ పరిధిలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. దళారులను నమ్మి మోసపోవద్దని చెప్పారు. అనంతరం డివిజన్ పరిధిలోని తహసీల్దార్లతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు.

అమరవీరులకు వందనం


అమరవీరుల స్థూపం వద్ద ప్రజా ప్రతినిధులు, అధికారుల నివాళి


బాపట్ల పట్టణంలో మానవహారం

బాపట్ల పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించారు. అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పరేడ్ నిర్వహించారు. స్థూపానికి ఎంపీలు మోపిదేవి వెంకట రమణారావు, నందిగం సురేష్, కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ వకుల్ జిందాల్, జేసీ సీహెచ్ శ్రీధర్, ఎమ్మెల్యే కోన రఘుపతి, ఎమ్మెల్సీ పోతుల సునీత, బౌడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, చీరాల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పుష్ప గుచ్ఛాలతో నివాళులర్పించారు.

– బాపట్లటౌన్

భక్తిశ్రద్ధలతో మాలధారణ

బాపట్ల అర్బన్: పట్టణంలోని సోమేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం మాలధారణ కార్యక్రమం జరిగింది. సుబ్బారావు గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప, భవాని మాలలను భక్తులు ధరించారు. ప్రతి ఇంటిలో అయ్యప్ప స్వామి, భవానీ మాలధారణ ప్రతిజ్ఞ కర్రూ చేయాలని గురుస్వామి సూచించారు. దీంతో సన్మార్గంలో పయనిస్తామని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

చింతమోటు(భట్టిప్రోలు): ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్య కరమైన పంటలను పండించి, అధిక ఆదాయం పొందవచ్చునని జెడ్‌బీఎన్‌ఎఫ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాణిశ్రీ అన్నారు. చింతమోటులో ఫీల్డ్ విజిట్‌లో భాగంగా రైతు ఎ. వెంకటేశ్వర నాయక్ సాగు చేస్తున్న పంట పొలంలో ఏటీఎం మోడల్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంటీ బాలా, రీసోర్స్ పర్సన్ శివనాగేశ్వరమ్మ, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

